# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు త్రివిధ దళాధిపతులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు.
- ❖ ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత వైఖరికి అంతర్జాతీయంగా మద్దతు లభిస్తోంది.
- ❖ భారత్ ను లక్ష్యంగా చేసుకొని పాకిస్తాన్ చేసిన అన్ని ప్రయత్నాలను సాయుధ దళాలు తిప్పికొట్టాయని ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ హెడ్‌క్వార్టర్స్ తెలిపింది.
- ❖ డ్రోన్ల సహాయంతో పాకిస్తాన్ భారత్‌లోకి చొరబాట్లకు ప్రయత్నిస్తోందని భారత సైన్యాధికారులు వెల్లడించారు.

====================

భారత్ - పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సాయంత్రం త్రివిధ దళాధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థాన్ దాడులకు పాల్పడడం, భారత సైన్యం వాటిని దీటుగా తిప్పికొట్టడం వంటివి జరుగుతున్న సమయంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో సీడీఎస్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. అంతకుముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షా .. బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, హోంశాఖ సీనియర్ అధికారులతో సమావేశమయ్యి, సరిహద్దుల్లోను, విమానాశ్రయాల్లోను భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

====================

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారత్ అనుసరిస్తున్న వైఖరికి అంతర్జాతీయంగా గట్టి మద్దతు లభిస్తోంది. ఆపరేషన్ సింధూర్ ప్రారంభించిన తర్వాత అమెరికా, బ్రిటన్, ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ వంటి దేశాలు భారత్ వైఖరికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ భారతదేశానికి సంఘీభావం ప్రకటిస్తూ.. ఉగ్రవాదంపై పోరాడటానికి భారత్ సార్వభౌమ హక్కును కలిగి ఉందని పేర్కొన్నారు. బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీ.. భారతదేశం ఆగ్రహించడానికి అనేక కారణాలు ఉన్నాయని, మాజీ ప్రధాని రిషి సునక్ సీమాంతర ఉగ్రవాదాన్ని ఏ దేశం సహించకూడదని ఉద్ఘాటించారు. ఇజ్రాయెల్ భారత్ కు అండగా నిలుస్తుందని పేర్కొంటూ... ఉగ్రవాదులకు ఆశ్రయం లేదని, తనను తాను రక్షించుకునే భారత్ హక్కుకు మద్దతిచ్చామని ఆ దేశ రాయబారి వ్యాఖ్యానించారు.

=====================

భారతదేశంలోని ఉత్తర, పశ్చిమ నగరాలను లక్ష్యంగా చేసుకొని పాకిస్తాన్ చేసిన అన్ని ప్రయత్నాలను భారత సాయుధ దళాలు తిప్పికొట్టాయని ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ హెడ్క్వార్టర్స్ తెలిపింది. జమ్మూ, పఠాన్ కోట్, ఉధంపూర్ లోని సైనిక కేంద్రాలు, అంతర్జాతీయ సరిహద్దుకు సమీపంలో ఉన్న మరికొన్ని ప్రాంతాలపై దాడి చేయాలని పాకిస్తాన్ ప్రయత్నించిందని పేర్కొంది. అయితే సాయుధ దళాలు ఈ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని వివరించింది. జమ్ముకశ్మీర్ లోని సత్వారీ, సాంబా, ఆర్ ఎస్ పుర, అర్నియాలపై పాకిస్తాన్ 8 క్షిపణులను ప్రయోగించారని.. అన్ని క్షిపణులను ఎయిర్ డిఫెన్స్ యూనిట్లు అడ్డుకున్నాయని తెలియజేసింది. జమ్ముకశ్మీర్ సాంబా జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద జరిగిన భారీ చొరబాటు ప్రయత్నాన్ని సరిహద్దు భద్రతా దళం భగ్నం చేసిందని తెలిపింది. పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులు చొరబడే ప్రయత్నాన్ని నిఘా గ్రిడ్ గుర్తించిందని బీఎస్ఎఫ్ వర్గాలు తెలిపాయి.

=====================

దేశంలో పంటదిగుబడి సమృద్ధిగా వచ్చిందని, రాబోయే పంటలకు కూడా అనుకూల పరిస్థితులు ఉన్నాయని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈరోజు ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ… దేశంలో ఆహార నిల్వలు సరిపడా ఉన్నాయని స్పష్టం చేశారు. జమ్ముకశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించి పరిస్థితులకు అనుగుణంగా విత్తనాలు నాటడానికి అవసరమైన ఏర్పాట్లు  చేస్తామని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల వ్యాపారం చేసే వ్యాపారులు, టోకు వర్తకులు లా ఎండ్ ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీలకు సహకరించాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ఎవరైనా ఆహార పదార్థాల అక్రమ నిల్వలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

=====================

ఆపరేషన్ సిందూర్ అనంతరం ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలు, నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా బీహార్ లో ఇండో - నేపాల్ సరిహద్దు, సీమాంచల్ జిల్లాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మధుబని, సీతామర్హి, సుపాల్, అరారియా, తూర్పు, పశ్చిమ చంపారన్ జిల్లాలతో సహా సరిహద్దు ప్రాంతాల్లో ఎస్ఎస్బీ, పోలీసులు గస్తీని ముమ్మరం చేశారు. అలాగే.. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు అధికారుల సెలవులను రద్దు చేసింది. భద్రతా ఏర్పాట్లు, సన్నద్ధతపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ సహా ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆయా కమాండ్ ఏరియాల్లో ఉన్న కీలక సంస్థల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

విరామం

=====================

పాకిస్తాన్ డ్రోన్లను ఉపయోగించి లేహ్ నుండి సిర్క్రీక్ వరకు 36 ప్రాంతాల్లో చొరబాట్లకు ప్రయత్నించిందని భారత సైన్యానికి చెందిన కల్నల్ సోఫియా ఖురేషీ తెలిపారు. ఈరోజు ఆమె న్యూఢిల్లీలో వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీలతో కలిసి ప్రత్యేక పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోఫియా ఖురేషి మాట్లాడుతూ.. పాకిస్తాన్ సైన్యం భారత పశ్చిమ సరిహద్దులను ఉల్లంఘించిందన్నారు. నియంత్రణ రేఖ వెంబడి భారీ ఆయుధాలను ప్రయోగించారని ఆమె పేర్కొంటూ…

(వాయిస్ 32 సెకన్లు)

పాకిస్తాన్ దాడులకు ప్రతిస్పందనగా భారత సాయుధ డ్రోన్లను పాకిస్థాన్ లోని నాలుగు గగనతల రక్షణ కేంద్రాలపై ప్రయోగించామని, ఒక డ్రోన్ ఏడీ రాడార్ ను ధ్వంసం చేసిందని వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ తెలిపారు. భారత

ప్రతీకార కాల్పుల్లో పాక్ సైన్యానికి భారీ నష్టం వాటిల్లిందన్నారు. పౌర విమానయాన సంస్థలను పాక్ కవచంగా వాడుకుంటోందని ఆమె విమర్శించారు.

ఈ సందర్భంగా విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. పాకిస్థాన్ భారత్ లోని ప్రార్థనా మందిరాలు లక్ష్యంగా దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు.

====================

దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం టెరిటోరియల్ ఆర్మీ సిబ్బందిని పిలిపించుకునే అధికారాన్ని చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ కు కల్పించింది. దీనిప్రకారం టెరిటోరియల్ ఆర్మీకి చెందిన అధికారులను, సిబ్బందిని, గార్డులను సాధారణ సైన్యానికి మద్దతుగా నిలిచేందుకు ఆర్మీ చీఫ్‌కు అధికారం లభిస్తుంది. దేశంలో ఉన్న 32 ఇన్‌ఫాంట్రీ బెటాలియన్లలో 14 బెటాలియన్లను రక్షణ మంత్రిత్వ శాఖ.. గెజిట్ నోటిఫికేషన్‌లో చేర్చింది. ఈ ఉత్తర్వులు 2028 ఫిబ్రవరి 9 వరకు అమలులో ఉంటాయి.

====================

దేశ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ దేశాన్ని కాపాడుతున్న సాయుధ దళాలకు తాము సంఘీభావం తెలుపుతున్నామని, సెల్యూట్ చేస్తున్నామని భారత క్రికెటర్ విరాట్ కోహ్లీ సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. మన దేశం కోసం సైనికులు, వారి కుటుంబాలు చేసే అచంచల ధైర్యసాహసాలకు తాము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని పేర్కొన్నారు. భారత సాయుధ దళాలకి సెల్యూట్ చేస్తున్నామని, తమని సురక్షితంగా ఉంచడానికి వారు చేసే ప్రతీ చర్యకు వారికి శాశ్వతంగా రుణపడి ఉంటామని భారత ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా వ్యాఖ్యానించారు.

====================

కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జేపీ నడ్డా ఆరోగ్య మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులతో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో అత్యవసర ఆరోగ్య వ్యవస్థల సన్నద్ధతను సమీక్షించారు. అవసరమైన మందులు, తగినంత రక్తం, ఆక్సిజన్, ట్రామాకేర్ కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఆసుపత్రులు, వైద్య సంస్థలకు సూచించారు. రాష్ట్ర, జిల్లా యంత్రాంగం, సాయుధ బలగాలు, వైద్యులు, ప్రైవేటు రంగ ఆసుపత్రుల ప్రాంతీయ సంఘాలతో పాటు అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలను సమన్వయం చేసుకోవాలని సూచించించారు. మెడికల్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ హెల్త్ సిస్టమ్స్ అన్నీ సన్నద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి ఆదేశించారు.

====================

కేరళలో 42 సంవత్సరాల మహిళకు నిఫా వైరస్ సోకడంతో మలప్పురం జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. మలప్పురంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి, వలంచెరి, పరిసర పంచాయతీల్లోని కొన్ని వార్డుల్లో కంటైన్మెంట్ జోన్లను ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు. వలంచెరి మున్సిపాలిటీలోని 4 వార్డులతో పాటు మరక్కర, అడయూర్, అథవానాడ్ గ్రామ పంచాయతీల్లోని కొన్ని వార్డులను కూడా కంటైన్మెంట్ జోన్లుగా ప్రకటించారు. ప్రజలు గుమికూడకుండా ఉండాలని, ఆసుపత్రుల్లో చేరిన వారిని సందర్శించవద్దని సూచించారు. అలాగే.. పక్షులు, జంతువులు కొరికిన పండ్లు తినవొద్దని, మాస్కులు ధరించాలని అధికారులు ప్రజలను కోరారు.

====================
====================